జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గుచేటు

మాట్లాడుతున్న నూనె కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 14: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కొండపాక మండలంలోని దుద్దెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో అమలు చేయని హామీలు అమలు చేసినట్లు తప్పుడు ప్రసంగం చేయించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి నిలదీస్తే దానికి సమాధానం చెప్పక ఎమ్మెల్యేను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం సబబుకాదన్నారు. జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడమంటే తెలంగాణ ప్రజలను కించపర్చినట్లేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డిపై నాటి కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యే కించపర్చే వ్యాఖ్యలు చేసిన నాటి ప్రభుత్వం కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. సమావేశంలో తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మల్లమారి రవీందర్, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ సున్నం భాస్కర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ పాతకోటి లింగం, నాయకులు సాదుపల్లి కనకసేన, చిక్కుడు భాను, పల్లె బాబు పాల్గొన్నారు.

గాయపడ్డ యువకుడికి ఆర్థిక సాయం

శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు విరాళాలు అందిస్తున్న యువకులు

చేర్యాల, మార్చి 14: పట్టణానికి చెందిన పోగుల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ దవాఖానలో చికిత్స పొంది ఇటీవల తిరిగి ఇంటికి చేరుకున్నాడు. శ్రీకాంత్‌కు వైద్యఖర్చుల నిమిత్తం పట్టణానికి చెందిన పలువురు యువకులు విరాళాల రూపంలో పోగుచేసిన రూ. 54,600ను శుక్రవారం క్షతగాత్రుడి కుటుంబానికి అందజేశారు. శ్రీకాంత్ పనులు చేసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. వైద్యంకోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పలువురు స్పందించి ఆర్థికసాయం చేయడంతో ఆయనకు అందజేసినట్లు తెలిపారు. విరాళాలు అందజేసిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

మహంకాళిదేవి అమ్మవారికి బోనాలు

ఊరేగింపుగా తీసుకెళ్తున్న బోనాలు

మిరుదొడ్డి, మార్చి 14: మండలంలోని ధర్మారంలో చెడ్డి, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మహంకాళిదేవి అమ్మవారికి గురువారం రాత్రి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలను బైండ్ల పోతరాజు విన్యాసాల మధ్య గ్రామంలో ఊరేగించారు. బోనాల్లోని నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో రెడ్డి, మున్నూరు కాపు సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో హోలీ సంబురాల్లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

రంగుల సంబురం

- జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగ
- చిన్నా పెద్దా అనే తేడాలేకుండా రంగులు చల్లుకున్న ప్రజలు

హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ పండుగ జరుపుకొన్నారు. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో గ్రామాలన్నీ రంగులమయంగా మారిపోయాయి. ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మార్చి 14

హుస్నాబాద్‌టౌన్: హోలీ సంబురాల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రజితావెంకన్న

సిద్దిపేట: హోలీ సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

ధూళిమిట్ట: కొండాపూర్‌లో..

చేర్యాల: పెద్దచెరువు కట్ట వాకర్స్ గ్రూపు సభ్యులు

దుబ్బాక: హోలీ సంబురాల్లో బీఆర్ఎస్ నాయకులు

నాడు జలకళ.. నేడు వెలవెల

- ఉమ్మడి మిరుదొడ్డి మండలం వ్యాప్తంగా 15 కిలో మీటర్ల మేరకు కూడవెల్లి వాగు
- మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో సుమారు 500 ఎకరాల్లో వరిసాగు
- కూడవెల్లి వాగులో అడుగంటిన నీళ్లు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

నాడు మార్చిలో నిండు కుండలా ఉన్న మల్లుపల్లి చెక్‌డ్యామ్ (ఫైల్)

మిరుదొడ్డి హైలెవల్ బ్రిడ్జి వద్ద నీళ్లులేక వెలవెలపోతున్న కూడవెల్లి వాగు

మిరుదొడ్డి, మార్చి 14: అష్టకష్టాలు పడి అప్పో సప్పో చేసి రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పంటలకు సాగునీటి గ్రహణం పట్టింది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నా రైతన్నలు వేసిన వరిపంటలకు సాగునీరు అందక ఎండుముఖం పట్టే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని అల్వాల, అందె, మిరుదొడ్డి, లింగుపల్లి, మల్లుపల్లి, కాసులాబాద్, మోతె, రుద్రారం, భూంపల్లి, అక్బర్‌పేట, కూడవెల్లి గ్రామాల శివారు భూములను కలుపుతూ 15 కిలోమీటర్ల వరకు వెళ్లివాగు ప్రవహిస్తుంది. యాసంగి సీజన్‌లో రైతులు వేసిన వరిపంట కరుకు దశలో ఉండగా మరికొంత వరిపంటలు పొట్ట దశకు వచ్చేసరికి చెక్‌డ్యామ్‌ల్లో నీరు అడుగంటింది. దీంతో పంటలకు నీరు అందే పరిస్థితి లేక రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి పంటలు ఎండకుండా మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందేమోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నీళ్లు వదిలితే పంటలు పండుతాయి

ఉమ్మడి మిరుదొడ్డి మండలం కూడవెల్లి వాగులోని 11 చెక్‌డ్యామ్‌లో 280 క్యూబిక్‌ఫీట్ల నీటి సామర్థ్యం ఉంది.దీంతో పరీవాహక ప్రాంత రైతులు సుమారు 500 ఎకరాల్లో పరి పంట సాగుచేశారు. కానీ కూడవెల్లివాగులో అలాంటి పరిస్థితి నేడు లేదు. చెక్‌డ్యామ్‌లో నీళ్లు అడుగంటడంతో పంపులకు సాగునీరు అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కూడవెల్లి వాగులోకి సాగునీరు విడుదల చేయాలని అన్న దాతలు వేడుకుంటున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండగా వేసవిలో కూడా కూడవెల్లి వాగు నిరంతరం ప్రవహించేదని, కానీ ఇప్పుడు అలా లేదని ఆయా గ్రామాల రైతులు చర్చించుకుంటున్నారు.

కేసీఆర్ హయాంలో వాగులో ఫుల్ నీళ్లు

కేసీఆర్ హయాంలో మండువేసవిలో కూడా కూడవెల్లివాగు పారింది. రైతులు ఎప్పుడు కూడా సాగునీళ్ల కోసం యాసంగిలో ఎదురు చూడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వరి పంటలకు నీటి కటకట తప్పడం లేదు. వెంటనే మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లివాగులోకి సాగు నీళ్లు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నా.

– జోగ్గారి బాల్‌నర్స్, రైతు, మాజీ సర్పంచ్, లింగుపల్లి

గత మార్చిలో మిరుదొడ్డి చెక్‌డ్యామ్ పైనుంచి దిగువకు ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు (ఫైల్)

నాడు ఫుల్ నీళ్లు.. నేడు ఇసుక మట్టి తేలింది

బీఆర్ఎస్ హయాంలో మండు టెండల్లో కూడా మల్లన్నసాగర్ నీళ్లతో కూడవెల్లివాగు పారేది. గిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడవెల్లి వాగులో నీళ్లు లేక ఇసుక మట్టి తేలింది, కొన్ని పొలాలు పొట్ట దశకు రాగా మరికొన్ని పొలాలు కరుకులోకి కూడా రాలేదు. వరి పంటలు ఎట్లా పండాలి. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే కూడవెల్లివాగులోకి సాగు నీరు విడుదల చేసి రైతులనున ఆదుకోవాలి.

– జోగ్గారి బాల్‌నర్సయ్య, రైతు, లింగుపల్లి

రైతులకు ఎంత కష్టం

- ఎండిపోతున్న పొలాలు
- పశువులకు మేతగా వరిపంట

చేర్యాల మండలం ఆకునూరులో ఎండిన వరిపొలంలో మేస్తున్న పశువులు

చేర్యాల/గజ్వేల్/బెజ్జంకి, మార్చి 14: కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో వ్యవసాయ పొలాలు ఎండిపోతున్నాయి. మండలంలోని ఆకునూరులో కొన్ని రోజులుగా బోర్ల నుంచి చుక్క నీరు రావడం లేదు. దీంతో చేసేది లేక రైతన్నలు సాగు చేసిన పంట పొలాల్లో పశువులను మేపుతున్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,ధూళిమిట్ట మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. నెల రోజులుగా చేర్యాల ప్రాంతంలో రోజుకు 20 చొప్పున రైతులు సుమారు 600 బోర్లు వేయగా అందులో పదుల సంఖ్యలో మాత్రమే సక్సెస్ అయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఆయా గ్రామాల్లోని చెరువులు నింపారు. బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి పంటలు విస్తారంగా పండడంతో రైతు కుటుంబాల్లో సంతోషం నెలకొంది. ఇప్పుడు కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్ల నుంచి చుక్కనీరు రాకపోగా, రైతులు అప్పుల పాలవుతున్నారు.

గుండారంలో ఎండుతున్న వరిపంట

బెజ్జంకి మండలం గుండారంలో నీటి ఎద్దడి వల్ల వరి పంట ఎక్కడికక్కడ ఎండిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి సాగు నీరు వచ్చే కాలువలకు మరమ్మతులు చేయకపోవడం మరో కారణంగా మారింది. గ్రామానికి చెందిన గైండ్ల నర్సయ్య అనే రైతు తనకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాడు. వేసవితోపాటు కరెంట్ కోతలు ఎక్కువగా ఉంటడంతో మూడు ఎకరాల్లో వరిపండి ఎండిపోయింది. సుమారు లక్ష వరకు నష్టం జరిగిందని రైతు గైండ్ల నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

రెండుసార్లు బోరు మోటర్ కాలింది.

గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన రైతు మల్లం సురేందర్ తనకున్న రెండున్నర ఎకరాల్లో వరిసాగు చేశాడు. కరెంట్ వస్తూ పోతుండడంతో ఇప్పటికే రెండు సార్లు బోరు మోటర్ కాలిపోయింది. ఎకరానికి పైగా వరి పంటకు నీళ్లు అందక ఎండిపోయింది. బోరు మోటర్ కాలిపోతే రెండు సార్లు రూ.15వేలకు పైగా ఖర్చు రాగా పెట్టుబడితో పాటు దున్నకాల ఖర్చులు వేలాల్లో అయ్యాయని రైతు సురేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గజ్వేల్ మండలం కొల్గూర్‌లో ఎండిన వరి పొలాన్ని చూపిస్తున్న రైతు మల్లం సురేందర్

జూదం స్థావరంపై పోలీసుల దాడి

- రూ.84,180 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 3 కార్లు, 5 మోటర్ సైకిళ్లు స్వాధీనం

పోలీసుల అదుపులో జూదం ఆడుతున్న వ్యక్తులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 14: జూదం స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడి చేశారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం సిద్దిపేట త్రీటౌన్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుద్దెడ గ్రామ శివారులో అనంతుల నరేందర్ ఫామ్ హౌస్‌లో కొంత మంది జూదం ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, త్రీ టౌన్ పోలీసులు దాడి చేశారు. వసూరి లింగం, అనంతుల నరేందర్, మంతూరి మహేశ్, వసూరి సురేందర్, వీర నారాయణ, మెరుగు శ్రీనివాస్, బూర్గు ప్రేమ్‌కుమార్, రైలాపూర్ రవీందర్‌రెడ్డి, నర్ర దేశయ్‌రెడ్డి, ఆరుట్ల సంపత్, తన్నీరు శ్రీనివాస్‌ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.84,180 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 3 కార్లు, 5 మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసుల మాట్లాడుతూ ఎక్కడైనా జూదం ఆడినా, ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా పోలీసులకు తెలియజేయాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం చిరస్మరణీయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 14: తెలంగాణ సాయుధ పోరాటం చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మహ్మదాపూర్ గుట్టల్లో తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి 77వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నాడు కమ్యూనిస్టులు పోరాటం చేశారన్నారు. వారి పోరాటం, త్యాగం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, గడిపె మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాపూర్‌లో అమరులకు నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి తదితరులు

నేడు డయల్ యువర్ డీఎం

సిద్దిపేట టౌన్, మార్చి 14 : ప్రజా రవాణా ఆర్టీసీ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట, దుబ్బాక డిపోల పరిధి, పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలు, రవాణా శాఖకు విలువైన సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు. సమస్యల కోసం సెల్: 9959226271 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గోవధ చట్టాన్ని అమలుచేయాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 14: హుస్నాబాద్ పశువుల అంగడిలో గోవధ చట్టాన్ని తప్పకుండా అమలు చేయాలని గో సంరక్షణ కమిటీ అధ్యక్షురాలు రాగి కవిత డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన హుస్నాబాద్‌లో పశువుల వేలంలో ఈ నిబంధనల గురించి కాంట్రాక్టర్లకు వివరించాలని ఆమె కోరారు. పశుసంవర్ధకశాఖ వైద్యుల అనుమతి లేకుండా గోవులను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. గోవధ చట్టాలను వివరించి గోవులను కాపాడాలని ఆమె కోరారు.

కానుకల చోరీకి యత్నం

హుండీలో చువ్వను పెట్టి తీస్తున్న వ్యక్తి

చేర్యాల, మార్చి 14: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలోని గంగరేగు చెట్టు పరిసరాల్లో ఏర్పాటు చేసిన బియ్యం హుండీలోని కానుకలు చోరీ చేసేందుకు ఓ వ్యక్తి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 12న సాయంత్రం బియ్యం హుండీలో సదరు వ్యక్తి త్రిశూలం ఆకారంలో ఉన్న ఇనుప చువ్వను గుచ్చి అందులో భక్తులు వేసిన నోట్లు, కానుకలు తీసేందుకు యత్నిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దానిని సెల్‌ఫోన్‌లో ఫొటో తీశారు. రెండు రోజుల అనంతరం చోరీకి యత్నిస్తున్న ఫొటో కొమురవెల్లి మండలానికి సంబంధించిన వాట్సాప్ గ్రూపులో ప్రత్యక్షమైంది. గ్రూపులో వచ్చిన కొద్ది సమయంలోనే ఆ ఫొటో డిలీట్ చేయడంతో సర్వత్రా చర్చకు దారితీసింది. హుండీ నుంచి కానుకలు తీసేందుకు యత్నించిన వ్యక్తి మానసిక స్థితి సరిగ్గా లేదని పలువురు తెలిపారు.

బేగంపేటలో ఆనందయ జాతర

జాతరకు తరలివచ్చిన భక్తులు

బెజ్జంకి, మార్చి 14: మండలంలోని బేగంపేటలో శుక్రవారం ఆనందయ్య జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను రథంపై ఉంచి ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆల యం కిక్కిరిసిపోయింది. భక్తులు గ్రామం లో వాహనాల ఊరేగింపు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దినేశ్‌కు డబుల్ ధమాకా

డబుల్ ధమాకా

దినేశ్

గజ్వేల్, మార్చి 14: పట్టుదలతో రెండు ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను నిజం చేశాడు. గజ్వేల్ మండలం కొడకండ్లకు చెందిన వనజ, గంగారామ్ దంపతుల కుమారుడు దినేశ్ గతేడాది విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై మర్కూక్ తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నా డు. శుక్రవారం విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధిం చి సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక య్యాడు. ఏడాదిలోనే రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తంచేశారు.

ఖజానా నింపండి

కింది స్థాయి సిబ్బందికి ఉన్నతాధికారుల హెచ్చరికలు

- పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- హుస్నాబాద్‌లో ఇప్పటికే 60శాతం పైగా వసూలు



పన్నుల వసూలు కార్యక్రమంలో అధికారులు (ఫైల్)

హుస్నాబాద్ టౌన్, మార్చి 14: ఎట్టి పరిస్థితుల్లో ఖజానా నింపాల్సిందే... పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం కనిపించొద్దు... ఖజానా ఖాళీగా ఉంటే అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయి... అలా ఉంటే చర్యలు తప్పవు ఇది ఆస్తిపన్ను వసూళ్లపై ఉన్నతాధికారుల హెచ్చరికలు... దీంతో హుస్నాబాద్ మున్సిపల్‌కు చెందిన అధికారులు, సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్ల కోసం ఇంటింటికి తిరుగుతూ వందశాతం పూర్తిచేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

వందశాతం చేయాల్సిందే...

ఈ ఏడాది 2024-25 సంవత్సరానికి 7,276 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు రూ. 1.70కోట్ల పన్నులు వసూలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 60 శాతం పన్నుల వసూలు జరిగినట్లు అధికారులు వివరిస్తున్నారు. ఈ ఏడాది ఆస్తిపన్ను పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు మైకుల ద్వారా ప్రచారం చేయించడమే కాకుండా, ఇంటింటికీ తిరుగుతూ పన్నులు చెల్లించాని కోరుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వందశాతం పన్నులు వసూలు చేసే లక్ష్యంగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

వసూళ్ల కోసం ప్రత్యేక టీంల ఏర్పాటు

హుస్నాబాద్ మున్సిపాలిటి పరిధిలో ఆస్తి పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులు, తాగునీటి కనెక్షన్లు, ట్రేడ్‌లైసెన్సులు, ఖాళీస్థలాలు, ప్రచారబోర్డులతోపాటు పలు రకాల పన్నులు వసూలు చేసేందుకు లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. ఇందుకు ఆరు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. సంవత్సరాల తరబడి పన్నులు చెల్లించని వారికి రెడ్‌నోటీసులు సైతం మున్సిపల్ అధికారులు ఇప్పటికే జారీ చేశారు.

పన్నులు చెల్లించకుంటే చర్యలు

మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. పన్నులు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి కోసం పన్నులు చెల్లించి సహకరించాలని కోరుతున్నాం.

– తాటి మల్లికార్జున్‌గౌడ్, కమిషనర్, హుస్నాబాద్ మున్సిపల్

అంగడి వేలం ఆలస్యం

- తాత్సారం చేస్తున్న అధికారులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 14: హుస్నాబాద్ (తైబజార్) పశువుల అంగడివేలం నిర్వహించే విషయంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోనే అతిపెద్ద పశువుల అంగడిగా పేరొందిన హుస్నాబాద్ పశువుల అంగడివేలం మున్సిపల్‌కు పెద్ద ఆదాయవనరుగా నిలుస్తున్నది. గత ఏడాది అంగడి వేలం కోటి ఇరవై లక్షల ఇరవై వేలు పలికింది. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు 2025-26 సంవత్సరానికి వేలం నిర్వహించే విషయంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోవడం విశేషం. గత ఏడాది హుస్నాబాద్ పశువుల అంగడి టెండర్లను మార్చి 5వ తేదీ నుంచి 11వతేదీవరకు స్వీకరించి 12వ తేదీన వేలం నిర్వహించారు. కానీ ఈ ఏడాది వేలం నిర్వహణ ఊసేలేదు. మరో వైపు పాత కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువు మార్చితో ముగుస్తుండగా ముందస్తుగానే వేలం నిర్వహించి కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. పైగా వేలం నిర్వహించేందుకు మున్సిపల్ ప్రత్యేకాధికారి అనుమతి కోసం ఫైల్ పంపడం జరిగిందని, అనుమతి వచ్చిన తర్వాత నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా మార్చి రెండో వారంలో నిర్వహించే వేలంను ఈ ఏడాది రెండోవారం గడుస్తున్నా నిర్వహించే విషయంపై నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బకాయి ఉన్నట్టా.. లేనట్టా...

2023-24 సంవత్సరానికి ఎనభై లక్షలు పలికిన అంగడి వేలం 2024-25 సంవత్సరానికి కోటి ఇరవైలక్షల ఇరవై ఐదువేలు పలికింది. మున్సిపల్‌కు చెల్లించాల్సిన టెండర్ డబ్బులను ప్రతి మూడు మాసాలకొకమారు చొప్పున జనవరి వరకు పూర్తిస్థాయిలో చెల్లించాల్సి ఉంటుంది. సదరు కాంట్రాక్టర్ మున్సిపల్‌కు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదనే ప్రచారం జరుగుతోంది. ఒకవైపు గత ఏడాది టెండర్ గడువు మరో ఇరువై రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో డబ్బులు పూర్తిస్థాయిలో వసూలు చేయకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై మున్సిపల్ ఆర్ఐ కనకయ్యను వివరణ కోరగా ఎంత బకాయి ఉందనేది తనకు తెలియదని చెప్పారు. అసలు బకాయి ఉందా లేదా అనే విషయాన్ని అధికారులే స్పష్టంగా వెల్లడించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఎంత చెల్లించారనే విషయం తెలియదని ఆర్ఐ సమాధానం ఇవ్వడం విశేషం. మరి బకాయిని వసూలు చేస్తారా లేక గతంలో లాగానే నిర్లక్ష్యంగా వదిలేస్తారో వేచిచూడాలి.